క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

బాల్కొండ: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ముప్కాల్ మండల కేంద్రంలో జీపీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, క్యాన్సర్‌ను తరిమి కొట్టాలన్నారు. జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. ఎంపీడీవో దామోదర్, ఆర్ఐ గంగాధర్, ఈవో విజయ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

బాల్కొండ: బాల కార్మికులను ఇటుక బట్టీల వద్ద పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని బాల్కొండ ఎస్సై గోపి హెచ్చరించారు. శుక్రవారం ఇత్వార్‌పేట్, బస్సాపూర్, జలాల్‌పూర్ శివారుల్లోని ఇటుక బట్టీల వద్ద గల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 44 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ భాస్కర్, ఆర్ఐ శరత్, నాయకులు సుధాకర్, అజ్మత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ విద్యార్థుల ప్రతిభ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో విశ్వం ఎడ్యుటెక్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అబాకాస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈ పోటీల్లో జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్ అభినందించారు.

విరాళాల సేకరణ

నందిపేట్(ఆర్మూర్): చలో ఖమ్మం కార్యక్రమానికి తరలివెళ్లడానికి శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. వ్యాపారస్తుల నుంచి నగదును పోగు చేశారు. ఈ నెల 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో మూడు పార్టీల విలీన మహాసభ జరుగుతుందని, ఈ సభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సభలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రజాపంథా జిల్లా నాయకులు కె.గంగాధర్ కోరారు. సీపీఐ ఎంఎల్ మండల కార్యదర్శి పి.సాయరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెంజల్ హైస్కూల్‌లో గోరుముద్ద ప్రారంభం

రెంజల్(బోధన్): రెంజల్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు గోరుముద్దను అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవా ప్రతినిధులు ముందుకు వచ్చారు. శుక్రవారం విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు ముగిసే వరకు ప్రతి రోజు సాయంత్రం అల్పాహారం అందిస్తామని లయన్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎంపీడీవో శంకర్, లయన్స్ ప్రతినిధులు పాండు రంగారావు, బాల గంగాధర్, ఆది నారాయణ, పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, పీఈటీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సామగ్రి చోరీ

నందిపేట్ (ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు.. కుద్వాన్‌పూర్ గ్రామంలోని టెంట్ హౌస్, మహిళా సంఘం భవనం, ఆర్డర్ మెస్ షట్టర్ తాళాలు పగలగొట్టి లోనికి చొరబడి వస్తు సామగ్రిని ఎత్తుకెళ్లారు. వస్తువుల్ని చిందరవందరగా పడేశారు.

ప్రజలకు చేరువలో కేంద్ర ప్రభుత్వ పథకాలు

మాక్లూర్: ప్రజలకు చేరువలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, వాటిని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పల్లెకు పోదాం(గావ్‌ఛలో) అభియాన్ మండల కన్వీనర్ ముప్పడి గంగారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. కర పత్రాలను పంచి పెట్టారు. అలాగే మహిళ సంఘాలు, పాఠశాలలను పరిశీలించారు. రైతులతో సమావేశం అయ్యారు. పార్టీ మండల కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు విజయ్, రవియాదవ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 31వ వార్డులో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని బీజేపీ మోర్చా టౌన్ ప్రెసిడెంట్ బొశెట్టి కుమార్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. వారం రోజులుగా డ్రైనేజీ నీరు ఇళ్లల్లోకి వస్తుందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పేరుకే గ్రంథాలయం

- ఏర్పాటై ఆరు నెలలైనా అందుబాటులోకి రాని సేవలు
- పుస్తకాలు లేక బోసిపోతున్న గది
- అధికారులు స్పందించాలని కోరుతున్న డొంకేశ్వర్ ప్రజలు



డొంకేశ్వర్ మండల కేంద్రంలో మూసి ఉన్న గ్రంథాలయం..


పుస్తకాలు లేక ఖాళీగా ఉన్న లోపలి గది

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పేరుకే పరిమితమైంది. ఆరు నెలలు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామ పంచాయతీ నుంచి వసతులు సమకూర్చినప్పటికీ పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో గ్రంథాలయం మూసి ఉంటోంది. దీంతో పుస్తకాలు, పాఠకులతో నిండుగా ఉండాల్సిన గది బోసిపోయి కనిపిస్తోంది. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రజల విన్నపం మేరకు జిల్లా గ్రంథాలయ అధికారులు గ్రంథాలయాన్ని మంజూరు చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న విశాల భవనంలో దీనిని ఏర్పాటు చేయగా, పుస్తకాలు లేని కారణంగా ఇంకా ప్రారంభించలేదు.

సహకారం కోసం ఎదురు చూపులు..

గ్రామ పంచాయతీ నుంచి తమ వంతుగా టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ర్యాక్‌లు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. న్యూస్ పేపర్ల కొనుగోలుకు రూ.500, లైబ్రరీ నిర్వహణ కోసం అటెండర్‌కు నెలకు రూ.1,000 చొప్పున జిల్లా గ్రంథాలయం నుంచి అతి తక్కువ మొత్తంలో నిధులు ఇస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన సమస్యల్లా పుస్తకాలు లేకపోవడమే. ఐతే, పుస్తకాలు కూడా ఇవ్వాలని గ్రంథాలయ అధికారులు జీపీ నుంచి లేఖ రాశారు. కాని ఇంత వరకు సరఫరా చేయలేదు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలు అందజేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు.

దాతలు ముందుకు రావాలి

మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు కావడం గ్రామ ప్రజలకు ఎంతో మేలు. పంచాయతీ తరఫున టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు సమకూర్చాం. పుస్తకాల కోసం ఎదురుచూస్తున్నాం. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి పుస్తకాలు అందజేస్తే లైబ్రరీని అందుబాటులోకి తెస్తాం.

– శేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, డొంకేశ్వర్

అధికారులు స్పందించాలి

మా ఊరికి లైబ్రరీ రావడం సంతోషంగా ఉన్నప్పటికీ పుస్తకాలు లేక దానిని ప్రారంభించుకోలేకపోవడం బాధాకరంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. చరిత్రకారుల చిత్రపటాలను కూడా గ్రంథాలయంలో పెట్టాలి. – సుంకరి నాగరాజు, డొంకేశ్వర్

చిన్నమ్మా.. సల్లంగా సూడమ్మా


జాతరలో పాల్గొన్న భక్తులు

బాల్కొండ: చిలుకల చిన్నమ్మా.. సల్లంగా సూడమ్మా అంటూ శ్రీరాంపూర్‌లో కొలువుదీరిన చిలుకల చిన్నమ్మను భక్తులు శుక్రవారం వేడుకున్నారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున చిన్నమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతర మొత్తం జన సంద్రంగా మారింది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందినది కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల్కొండ ఎస్సై గోపి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


లడ్డూను దక్కించుకున్న గుమ్ముల కిషన్

భక్తి శ్రద్ధలతో అయ్యాల జాతర

వేల్పూర్: వేల్పూర్, రామన్నపేట్ గ్రామాలలో శుక్రవారం అయ్యాల జాతర భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. రామన్నపేట్‌లో ఉదయం గ్రామం నుంచి అయ్యలగుట్ట దాకా పల్లకిలో దేవతా మూర్తులను ఊరేగించారు. వేల్పూర్ అయ్యాల జాతరలో స్వామివారి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలం పాటలో ఔత్సాహికులు పోటీపడ్డారు. వేల్పూర్‌కు చెందిన గుమ్ముల కిషన్ రూ.42 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలి

- ఏఐకేఎంఎస్ నేత వి ప్రభాకర్


మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లీకేజీ వాటర్‌తో పంటలను కాపాడాలని 2018లో ఉద్యమం చేసిన రైతులపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తేస్తామని స్వయంగా సీఎం ప్రకటించినా కూడా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కేసులను తిరగదోడి వారెంట్లు జారీ చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏ లాంటి సంస్థలను అడ్డుపెట్టుకొని సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ ఇంట్లో సోదాలు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా మౌనంగా ఉండటం సరైంది కాదన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి దేవరాం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న రెంజల్ ఆస్పత్రి వైద్యుడు

రెంజల్(బోధన్): నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెంజల్ ఆస్పత్రి వైద్యుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 20న నులి పురుగుల దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని సూచించారు. 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 3 నుండి 19 సంవత్సరాల వారికి ఒక మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత అందించాలని సూచించారు. పిల్లలు నమిలి మింగేలా జాగ్రత్తలు తీసుకునాలన్నారు. ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

బోధన్‌టౌన్(బోధన్): హెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ డేటా నమోదు శిక్షణతో పాటు, పల్స్ పోలియో, నులిపురుగుల నివారణపై డివిజన్‌లోని ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సును శుక్రవారం శక్కర్‌నగర్ కాలనీ గోల బస్తీ దవాఖానాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి సుదర్శనం హాజరై మాట్లాడారు. హెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ డేటా నమోదుపై అందరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లా ఉప వైద్యాధికారి విద్య, డీడీఎం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టిప్పర్ యజమానికి రూ.10వేల జరిమానా

నవీపేట: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన టిప్పర్ యజమానికి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. రెంజల్ మండలం సాటాపూర్ నుంచి కోస్లీ గ్రామానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన టిప్పర్ యజమానికి తహసీల్దార్ ధన్వాల్, జరిమానా విధించారు.

దోమల బెడదను నివారించండి

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపల్ పరిధిలోని 38 వార్డుల్లో దోమల బెడదను నివారించాలని పట్టణ యువకులు కోరారు. శుక్రవారం యువకులు మున్సిపల్ డీఈ లింగంపల్లి శివానందానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని 15 వ వార్డులో గల పాన్ గల్లీ, నర్సి రోడ్డు, ఏకచక్రనగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరిందని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శివ కుమార్, గందం రాజేష్, శంకర్‌గౌడ్, మేదరి నగేష్, తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పరిసరాలు, పరిశుభ్రత అనే అంశంపై పోటీలు నిర్వహించారు. గ్రామ ప్రత్యేక అధికారి విజయ్‌కాంత్ రావు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు పటావ్రీ తులసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏక చక్రేశ్వర ఆలయ ఆవిర్భావ దినోత్సవం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయం(శివాలయం) ఆవిర్భావ దినోత్సవం దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం పుష్య బహుళ అమావాస్య రోజు శ్రీఏకచక్రేశ్వర స్వామి 65వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆలయంలోని సాలాగ్రామ శిలా శివలింగానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాగంణంలో ఆలయ ప్రధానార్చకులు గణేష్ మహరాజ్, ప్రముఖ అర్చకులు సంతోష్ శర్మ, నాగేష్ శర్మల వేద మంత్రోచ్ఛరణాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులతో ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయంలో పల్లకి సేవ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, ఆలయ ప్రధానార్చకులు, ఆలయ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పల్లెలను శుభ్రంగా ఉంచుదాం


జెడ్పీ చెర్మన్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

నందిపేట్(ఆర్మూర్): పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆదర్శంగా నిలవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బజార్‌కొత్తూర్‌లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో నాగవర్ధన్, గ్రామ పెద్దలతో కలిసి గ్రామంలోని చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌ను గ్రామస్తులు సన్మానించారు. అనంతరం నందిపేట మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో జెడ్పీ నిధులతో వేసిన బోరుబావిని ప్రారంభించారు. మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, మాజీ సర్పంచు సాయగౌడ్ పాల్గొన్నారు.

క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలి


మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటస్వామి

ఆర్మూర్‌టౌన్: ప్రయాణికులను ఆర్టీసీ బస్సు డ్రైవర్లు క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఎంవీఐ వెంకటస్వామి అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డీపోలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డిపో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సులను నడపవద్దన్నారు. అనంతరం ఆర్మూర్ డిపోలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బస్సు నడిపిన డ్రైవర్లను సన్మానించారు. డిపో మేనేజర్ ఆంజనేయులు, ఎస్సై గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ ఆగవు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ ఆగవని, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి పేర్కొన్నారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలేవీ ఆగిపోవని అనడానికి నిదర్శనం శుక్రవారం తమ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి పథకం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడమేన్నారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూ తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే వంట గ్యాస్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రుణమాఫీ, మహిళలకు భరోసా పథకాలు అమలు చేస్తుందని అన్నారు. నాయకులు తిప్పిరెడ్డి శ్రీను, సల్లూరి గణేష్, సింగిరెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ హైస్కూలులో ప్రతిభా పోటీలు

వేల్పూర్: అంక్సాపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రతి భా పోటీలు నిర్వహించారు. పెయింటింగ్, స్పీచ్, సాంగ్స్, పద్య భాగంపై పోటీలు నిర్వహించారు. పెయింటింగ్‌లో కుకునూర్ హైస్కూలుకు చెందిన శ్రీనిధి, పాటలలో అంక్సాపూర్ హైస్కూలుకు చెందిన అక్షిత, పద్యభాగంలో జశ్వంత్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులు అందజేశారు. వీరు ఈనెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం రవి చందర్, సైన్స్ టీచర్ రఘునాథ్ పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ఆర్మూర్/ఆర్మూర్‌టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక, రైతు జేఏసీ నాయకులు పల్లెపు వెంకటేష్, ముత్తెన్న, ఖాజా మొయినుద్దీన్, సుధాకర్‌లు మాట్లాడారు. మోదీ ఎన్నికల వాగ్దానాన్ని గాలికి వదిలి భారత వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగాన్ని దివాలా తీయించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచి కామకోటి పీఠం ప్రశంసలు

మోర్తాడ్: కంచి కామకోటి పీఠం నిర్వహించిన మహాభారత పద్య సుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న తడపాకల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరచగా వారికి పీఠం ప్రతినిధులు ప్రశంసా పత్రాలతో పాటు విలువైన పుస్తకాలను అందించారు. వాటిని తడపాకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావిద్ శుక్రవారం విద్యార్థులకు అందించారు. తడపాకల్ విద్యార్థులు 108 మహాభారత పద్యాలను చక్కగా వివరించి అందరి మన్నలను పొందారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ ప్రవీణ్ శర్మ, ఉపాధ్యాయులు రాములు, గంగాధర్, సుధాకర్, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్సు దినోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'సుస్థిర భవిష్యత్తు కోసం విజ్ఞాన శాస్త్రం' అనే అంశంపై విద్యార్థులకు నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

ఉపన్యాస పోటీల్లో ఆర్మూ ర్ పట్టణంలోని బాలికల పాఠశాలకు చెందిన ప్రవీ ణ, పాటల పోటీల్లో పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య, కవిత్వంలో కేజీబీవీకి చెందిన నందనశ్రీ, చిత్రలేఖనం పోటీల్లో పట్టణంలోని రాంమందిర్ పాఠశాలకు చెందిన సిద్దార్థ ఉత్తమ ప్రతిభతో ఈ నెల 12న నిజామాబాద్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం రవీందర్ బహుమతులను అందజేశారు.

సంతకాల ఫోర్జరీ.. కేసు నమోదు

బోధన్ టౌన్ (బోధన్): తప్పుడు ధ్రువపత్రాలు తయారు చేసి ఫోర్జరీ సంతకాలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు.. బోధన్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ అజీమ్‌కు ఎన్ఎస్ఎల్ ఫ్యాక్టరీకి చెందిన గోల్డెన్ జూబ్లీ లే ఔట్ పాండు ఫారం ఎఫ్ బ్లాక్‌లో ప్లాట్–55 ఉంది. ప్లాట్‌కు సంబంధించి ఫ్యాక్టరీ నుంచి ఎన్‌వోసీ కూడా ఆయన పొందారు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, అజీమ్ సంతకాలు ఫోర్జరీ చేసి శుక్రవారం సేల్‌డీడ్ చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వేరే వ్యక్తి రావడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్, ప్లాట్ యజమానికి సమాచారం అందించారు. అజీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అజీమ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పసుపు పంట కోత ప్రయోగం

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో అర్థ గణాంక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు పంట కోత దిగుబడి ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన నర్సయ్య పంట భూమిలో తవ్వకాలు చేపట్టి దిగుబడిని కొలిచారు. ప్రతి సంవత్సరం రెండు గ్రామాలను ఎంపిక చేసుకుని అన్ని పంటల కోత ప్రయోగం చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. దీని ద్వారా మార్కెట్‌లో డిమాండ్‌ను అంచనా వేస్తూ సప్లై చేపట్టవచ్చన్నారు. రాష్ట్ర అర్థ గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

బియ్యం వేలం పాట వాయిదా

రెంజల్(బోధన్): వ్యాపారులు ముందుకు రాకపోవడంతో శుక్రవారం నిర్వహించాల్సిన బియ్యం నిల్వల బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్లు తహసీల్దార్ రాంచందర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యాపారులు ముందుగా రూ. 25 వేల డీడీని అందించాల్సి ఉంటుందన్నారు. ఒక్కరు మాత్రమే డీడీని అందించి మిగిలిన వారు నేరుగా వేలంలో పాల్గొనడంతో 14వ తేదీకి వాయిదా వేశామన్నారు.

పడగల్‌లో సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్

వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో ఈ నెల 17, 18 తేదీలలో అంబేడ్కర్ యూత్ సహకారంతో ఇన్విటేషన్ సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సందీప్, బ్రిజేష్‌రాజ్, శంకర్ శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మ్యాట్‌పై కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు షూ, డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. పోటీలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయన్నారు. టోర్నీలో విన్నర్ జట్టుకు రూ. 20 వేల, రన్నర్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు 7989492920, 9553611386 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు తహసీల్ ఆఫీస్‌లో పీడీఎస్ బియ్యం వేలం

బోధన్‌రూరల్(బోధన్): స్థానిక తహసీల్ కార్యాలయంలో అధికారుల తనిఖీల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని శనివారం(నేడు) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు బోధన్ తహసీల్దార్ గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలవారు రూ.10వేలు డీడీ రూపంలో తహసీల్దార్ బోధన్ పేరున చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.